మహా శివరాత్రికి శైవక్షేత్రాల ముస్తాబు



విద్యుత్ దీపాలంకరణలో అప్పికొండ సోమేశ్వరస్వామి వారి ఆలయం

గాజువాక : పవిత్ర మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గాజువాక ప్రాంతంలోని శైవ క్షేత్రాలు పూజా కార్యక్రమాలకు ముస్తాబయ్యాయి. వినాయకనగర్ వుడా కాలనీ కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పాతగాజువాక దరి చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్ప స్వామి ఆలయాలు, దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాలు, బీసీరోడ్డు సంజీవకాలనీలో భద్రావతి భావనా రుషీశ్వరుల సమేత సత్యనారాయణస్వామి ఆలయ, భానోజీ కాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, సుందరయ్య కాలనీ దరి దుర్గానగర్‌లోని దుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా మహోత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

అప్పికొండ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

పెదగంట్యాడ: మహా శివరాత్రి పర్వ దినానికి జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది.. లక్షలాదిగా తరలి రానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని సర్వం సిద్ధం చేశారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం సాగర తీరాన ఉండడంతో రాత్రి జాగారణ అనంతరం సూర్యోదయ సమయంలో సముద్ర స్నానాలు ఆచరించడం ఇక్కడ ఆనవాయితీ. తరువాత స్వామి వారిని దర్శించుకుంటారు. ఇందుకు తగ్గట్టుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శనివారం వేకువజామున 5 గంటలకు నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం నుంచి భక్తుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఉత్సవాలు ప్రారంభం

బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక దివ్యజ్యోతి భవన్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాల్లో ఒకటైన అమరనాథ్ నమూనాతో పాటు పసిడి శివలింగాన్ని భక్తుల దర్శనార్థం అందుబాటులో ఉంచారు. బ్రహ్మకుమారీస్ జిల్లా కో–ఆర్డినేటర్ బికో త్రివేణి, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, పార్టీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, సీనియర్ నాయకులు జి.పూర్ణానందశర్మ, మాజీ ఎంపీపీ ఎం.నీలబాబు, జిల్లా ఇన్‌చార్జి రాజయోగి బి.కె.సోమేశ్వరి పాల్గొన్నారు.



అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన అమరనాథ్ సెట్‌ను ప్రారంభిస్తున్న దేవన్‌రెడ్డి

డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

కూర్మన్నపాలెం : కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం, సంబంధిత నేరాలు, పొగాకు, సిగరెట్లు, మత్తు పదార్థాలకు బానిసలు కావడం తదితర విషయాలపై విద్యార్థులకు గాజువాక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.మన్మథరావు అవగాహన కల్పించారు. పాఠశాల దగ్గరలో ఉన్న షాపులను సందర్శించి గుట్కా, ఖైనీ, సిగరెట్ల అమ్మకాన్ని నిషేధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాష్‌రావు, పీడీ మన్నాజీ, ఎస్ఐ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న గాజువాక ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మన్మథరావు

కచ్చితమైన ఆధారాలుంటేనే గదులు కేటాయించాలి

గాజువాక : హోటళ్లు, లాడ్జిల్లో బస కోసం వచ్చే వారి నుంచి కచ్చితమైన ఆధారాలు తీసుకున్న తర్వాతే గదులు కేటాయించాలని క్రైమ్ డీసీపీ నాగన్న పేర్కొన్నారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో గల లాడ్జిలు, హోటళ్ల యజమానులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ప్రతి హోటల్లోను వీఎంఎస్ అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ ఉపయోగాలను వివరించారు. నేరాల అదుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గాజువాక క్రైమ్ సీఐ సూర్యనారాయణ, సీసీఎస్ సీఐ సత్యనారాయణ, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రైమ్ డీసీపీ నాగన్న

సొసైటీ ఎన్నికల్లో 24 మంది అభ్యర్థులు

గాజువాక : బీహెచ్ఈఎల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో 24 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు ఎన్నికల నిర్వహణ అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికలు ఈనెల 23న ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఎనిమిది మంది పాలకవర్గ సభ్యులను ఎన్నుకోవడం కోసం నిర్వహించనున్న ఈ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, పరిరక్షణ ఫ్రంట్‌ల నుంచి ఎనిమిది మంది చొప్పున నామినేషన్లు దాఖలు చేయగా, మరో ఇద్దరు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు. వారిలో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ నామినేషన్లు శుక్రవారం విత్‌డ్రా చేసుకోగా, ప్యానెళ్ల నుంచి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు ఎన్నికల నిర్వహణ అధికారి సీహెచ్ఎస్ త్రినాథరావు తెలిపారు. విత్‌డ్రా అనంతరం బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

'వేతన సవరణ చేయకపోతే ప్లాంట్‌ను ముట్టడిస్తాం'



ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

పెదగంట్యాడ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఈ నెలాఖరులోగా వేతన సవరణ చేయకపోతే ప్లాంట్‌ను ముట్టడిస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ హెచ్చరించారు. వేతన సవరణలో జాప్యాన్ని నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఎదుట ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతన సవరణ చేయకుండా వారి మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు పెంచాలని కోరారు. కారు రమణ, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి ప్రభాకరరెడ్డి, ఎస్‌వీ నాయుడు, వేణు వర్మ, ఈశ్వరరావు, గోపీ నారాయణ, గంట్యాడ గురుమూర్తి, అవతారం, సాహూ, నాయక్, పోలీస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరిహారం అందజేత

పెదగంట్యాడ : ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గంగవరం పోర్టులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 74వ వార్డు పరిధి సిద్ధేశ్వరానికి చెందిన గొరుసు సత్యారావు మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం కింద కాంట్రాక్టర్ అప్పారావు అందజేసిన రూ. 5 లక్షలు మృతుని భార్య అప్పలనరసమ్మకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మృతుని భార్యకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



ఫల, పుష్పాలతో స్వామి సన్నిధిని అలంకరించిన దృశ్యం

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లో కొలువైన శ్రీ షిర్డీసాయి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. షిర్డీలో మాదిరిగా నిర్మించిన సాయి మందిరంలో మనిషి రూపంలో కొలువుదీరిన సాయినాథుడు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇక్కడి ఆలయంలోని బాబాను దర్శించుకుంటే షిర్డీలో సాయిబాబాను దర్శించుకున్న అనుభూతి భక్తుల్లో కలుగుతుంది. దీంతో పారిశ్రామిక ప్రాంతంతో పాటు విశాఖనగర పరిసర ప్రాంతాల నుండి భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఈ ఆలయ మహిమలను వర్ణించడం అసాధ్యమంటారు. బాబా వార్షికోత్సవం సందర్భంగా 9 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా సాయినాథునికి పంచామృత, ఫలోదక, సుగంధ, సువర్ణ, హిరణ్య, రజిత, పుష్ప, చందన, నవరత్న, సహిత ఏకాదశి కలశాభిషేకాలను ప్రధాన అర్చకులు వెంకట శ్రీధరస్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేని విధంగా వేలాది మందికి అన్నప్రసాదం లభించే విధంగా దత్తసాయి మందిర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. 9 రకాల వంటకాలతో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు.

ప్రకృతి యోగాశ్రమం ప్రారంభం

అగనంపూడి: యోగసాధన, ధ్యానం అందరి దైనందిన కార్యక్రమాల్లో భాగంగా మారుతోందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు అన్నారు. లంకెలపాలెం సమీపంలోని పెదముషిడివాడలో చంద్రశేఖర్ ప్రకృతి యోగాశ్రమాన్ని ప్రారంభించారు. ప్రశాంత జీవనం కోసం యోగ సాధన చేయాలన్నారు. టీఎస్ఆర్ టీబీకే కళాశాల డైరెక్టర్ బలరామకృష్ణ, నిర్గుణానంద యోగా గురూజీ పాలకుర్తి సుబ్బారావు, ట్రస్ట్ నిర్వాహకురాలు సీహెచ్ ఆదిలక్ష్మి, రాజయోగి బ్రహ్మకుమారి రమాదేవి, బీకే చంద్రశేఖర్ భాయీజీ, సర్పంచ్ పల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ప్రకృతి యోగాశ్రమం ప్రారంభోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ విశాఖ సారథ్యంలో యోగాశ్రమం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



యోగాశ్రమం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

వాల్తేర్ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మనోజ్ శర్మ వాల్తేర్ డివిజన్ పరిధి పలాస–విశాఖపట్నం సెక్షన్‌లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి శుక్రవారం విండో ఇన్‌స్పెక్షన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పలాస–విశాఖపట్నం సెక్షన్‌లోని ట్రాక్స్, మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్, సిగ్నలింగ్, పలు భద్రతా విషయాలను పరిశీలించారు. జీఎం, డీఆర్ఎంల తోపాటు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్స్, వాల్తేర్ డివిజన్‌కు చెందిన బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

వివిధ విభాగాధిపతులతో సమావేశం..

జీఎం మనోజ్ శర్మ విశాఖ చేరుకున్న తరువాత డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, డివిజన్ పనితీరు, అవలంబిస్తున్న భద్రతా ప్రమాణాలు, అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎంకు డీఆర్ఎం సత్పతి వివరించారు. యూనియన్ నాయకులు డీఆర్ఎం కార్యాలయంలో మనోజ్ శర్మకు స్వాగతం పలికారు.



డివిజన్‌కార్యకలాపాలను జీఎం మనోజ్ శర్మకు వివరిస్తున్న డీఆర్ఎం సత్పతి

క్లుప్తంగా

భూకంప బాధితులకు సరకుల పంపిణీ



సేకరించిన సరకులతో మసీద్ సభ్యులు

పెదగంట్యాడ : తుర్కియా, సిరియాలో ఇటీవల సంభవించిన భూకంపంతో నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ దోస్త్‌లో భాగంగా జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పెదపాలెంలో గల మసీద్–ఉల్–మొహమినస్ తరపున గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో సరకులు సేకరించారు. ఎమర్జెన్సీ మెడిసిన్, యాంటీబయొటిక్స్, సెలైన్ బాటిళ్లు, టార్పాలిన్లు, అడల్ట్ డైపర్స్, దుస్తులు, బ్లాంకెట్లు సేకరించారు. వీటిని భూకంప బాధితులకు అందజేసేందుకు సిరియా ఎంబసీకి శుక్రవారం పంపించారు.

నేడు ఉక్కు ఆవిర్భావ దినోత్సవం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం ప్లాంట్‌లోని సీడీవై యార్డులో సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు మొక్కలు నాటనున్నారు. సాయంత్రం ఉక్కునగరం క్లబ్ మల్టీపర్పస్ హాల్లో జరగనున్న కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులకు సీఎండీ చేతుల మీదుగా నెహ్రూ అవార్డులు, సీఐఎస్ఎఫ్ సిబ్బందికి ప్రతిభా అవార్డులు అందజేయనున్నారు.

కార్మికుల పోరాట పటిమకు కేంద్రం దిగి రాక తప్పదు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ఉక్కు కార్మికుల పోరాట పటిమకు కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 736వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎస్ఎంఎస్–1 కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం, భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర, అయోధ్య రామ్, ఎస్ఎంఎస్–1 కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న పల్లా చినతల్లి

గాజువాక : వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 67వ వార్డులో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి తదితరులు శుక్రవారం అప్పన్న కాలనీ, బొజ్జన్నకొండ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేష్, పల్లా సురేష్ కుమార్, కామినాయుడు, త్రినాథ్, వెంకటేష్, జైసలాం పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ పునర్నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాయి అనూష

గాజువాక : 68వ వార్డులో 3 లక్షల లీటర్ల సామర్థ్యంతో చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ గుడివాడ సాయి అనూష శుక్రవారం పరిశీలించారు. పాత ట్యాంక్ శిథిలం కావడంతో రూ.49 లక్షల వ్యయంతో దాన్ని పునర్నిర్మిస్తున్నామని, దీని ద్వారా మిందీ, అప్పన్న కాలనీ, రామ్‌నగర్, రాజీవ్‌నగర్, గిరి ప్రసాద్ కాలనీ ప్రజలకు నీటి సరఫరా అందిస్తామన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పాల్గొన్నారు.